చంద్రనగర్‌లో సీపీఐ అభ్యర్థి విమల ప్రచారం

విశాలాంధ్ర – విశాఖ: గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ 89వ వార్డు చంద్రనగర్‌లో కాంగ్రెస్, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపర్చిన ఇండియా కూటమి విశాఖ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల మంగళవారం సాయంత్రం ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ, దాని మిత్ర పక్షం టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థులను ఓడించాలని ఇండియా కూటమి అభ్యర్థులకు పట్టం కట్టాలని అత్తిలి విమల నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు బీజేపీ తెరలేపిందని,

దాని పరిరక్షణకు కృషి చేయాల్సిన వైసీపీ బీజేపీకి వంతపాడుతూ విశాఖ ప్రజానీకాన్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వామపక్ష అభ్యర్థుల విజయం నేడు అవశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ గోపాలపట్నం ఏరియా కార్యదర్శి బలివాడ వెంకట్రావు, నేతలు ఆర్.శ్రీనివాసరావు, విజయలక్ష్మి, పోలమ్మ, కాంతం, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కె రెహమాన్, ఆర్.శ్రీనివాసరావు, నాయకులు ఎండీ బేగం, అచ్యుతరావు, లక్ష్మణరావు, పుష్ప, దేవుడమ్మ, సత్యనారాయణ, బాను, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు అతి శక్తివంతమైనదని ప్రజాస్వామ్య పరిరక్షణకు అదొక వజ్రాయుధం లాంటిదని, దానిని సక్రమంగా వినియోగించుకోవటం ద్వారా తమ ప్రథమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున పేర్కొన్నారు. మే 13న జరిగే ఎన్నికలలో కుటుంబ సమేతంగా పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు ప్రాముఖ్యతను, ఆవశ్యకతను తెలుసుకోవాలని, వంద శాతం ఓటింగే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఓటరు చైతన్యం, ఓటు ప్రాముఖ్యత, వినియోగం, హోం ఓటింగ్ విధానం, పోలింగ్ స్టేషన్ల వద్ద కల్పించిన వసతులు, మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు తదితర అంశాలపై ఆల్ ఇండియా రేడియో ద్వారా జిల్లా కలెక్టర్ ఓటర్లకు సందేశం ఇచ్చారు. మంగళవారం ఉదయం స్థానిక ఆల్ ఇండియా రేడియో స్టేషన్ లో నిర్వహించిన టాక్ షోలో పాల్గొని ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. జిల్లాలో తొలిసారిగా ఓటు పొందిన 18–19 సంవత్సరాల మధ్యగల యువత సుమారు 60వేల మంది ఉన్నారని, వారంతా తమ ఓటు హక్కు వినియోగంలో ఉత్సాహం కనబరచాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబం ధనల ప్రకారం 85 ఏళ్లు దాటిన వృద్ధులకు, 40 శాతం వైకల్యం దాటిన వారికి ఇంటి వద్ద నుంచే ఓటు వేసుకొనే వెసులుబాటు కల్పించామన్నారు. ఇప్పటి వరకు సుమారు 1500 పై చిలుకు దరఖాస్తులు అందాయని అన్నారు. ఆల్ ఇండియా రేడియో టాక్ షోలో డీఐపీఆర్వో ఎస్.వి. రమణ, డివిజనల్ పీఆర్వో డి.నారాయణరావు, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రాం హెడ్ వీవీ రామ్ గోపాల్, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఎన్.సుధాకర్ రెడ్డి, డ్యూటీ అధికారి సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జన సందోహం మధ్య సీఎం బస్సు యాత్ర

విశాలాంధ్ర – ఆనందపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టా త్మకంగా చేపట్టిన బస్సు యాత్రకు అనూహ్య స్పందన లభిస్తుంది. నాయకులు, కార్యకర్తలు మధ్య కోలాహలంగా ఉదయం ఎండాడలో ప్రారంభమైన బస్సు యాత్ర ఆనందపురం కూడలికి మధ్యాహ్నం 12 గంటల సమయానికి చేరుకుంది. పది నిమిషాలు ఆగి నాయకులందరితో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల సమయానికి పెద్దిపాలెం చెన్నై కన్వెన్షన్‌లో సోషల్ మీడియా విభాగం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం జగన్ మాట్లాడుతూ రాష్ట్రానికి రథసారథులు సోషల్ మీడియా కార్యకర్తలని అన్నారు. మీరే నా బలం నా బలహీనత గ్రామ మండల జిల్లా పరిధి వరకు మీరే నాయకులని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపును భుజాన వేసుకొని ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, భీమిలి శాసనసభ్యులు అవంతి శ్రీను, జిల్లా నాయకులతో పాటు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పార్లమెంటు స్థానానికి మూడు నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: విశాఖ పార్లమెంటు స్థానానికి ఆరో రోజు మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నవతరం పార్టీ నుంచి గండికోట రాజేశ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి పులుసు సత్యనారాయణ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థినిగా మల్ల శ్రావణి నామినేషన్లు వేశారు. వారి నుంచి విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఆర్.వో., జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున తన కార్యాలయంలో సంబంధిత పత్రాలను స్వీకరించారు. ఇదిలా ఉండగా ప్రజాశాంతి పార్టీ నుంచి కిలారి ఆనంద్ పాల్ మంగళవారం మరొక సారి రెండో సెట్ పత్రాలను ఆర్.వో.కు అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ నామినేషన్ పత్రాలను పరిశీలించి అభ్యర్థులకు సహకారం అందించారు.

ఏయూలో ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం

విశాలాంధ్ర – విశాఖ సిటీ: పుస్తక పఠనాసక్తిని నేటి తరం యువతలో పెంపొందించాలని ఏయూ డాక్టర్ వి.ఎస్.కృష్ణా గ్రంథాలయం గౌరవ గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూగ్రంథాలయంలో ఎస్.ఆర్ రంగనాథన్, రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహాలకు పూలమాలలు వేసారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుస్తకం నుంచి లభించే జ్ఞానం వ్యక్తి వికాసానికి దోహదపడుతుందన్నారు. దీని ఆవశ్యకతను గుర్తించి, విద్యార్థులకు వివరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మే 24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

విశాలాంధ్ర – భీమిలి: మే 24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ శివరాణి తెలిపారు. స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ మే 24న తెలుగు, 25న హిందీ, 27న ఇంగ్లీష్, 28న లెక్కలు, 29న ఫిజికల్ సైన్స్, 30న బయాలజీ సైన్స్, 31 సోషల్ పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు జరుగుతాయని చెప్పారు. అదేవిధంగా జూన్ 1న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2, ఉదయం 9.30 నుంచి 11.15 వరకు, ఒఎస్ ఎస్ సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 ఉదయం 9.30 నుంచి 12.45 వరకు, జూన్ 3న ఒఎస్ఎస్ సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 ఉదయం 9.30 నుంచి12.45 వరకు జరుగుతాయని తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంలోనే నాయి బ్రాహ్మణులకు గుర్తింపు

పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్

విశాలాంధ్ర – మర్రిపాలెం: నాయి బ్రాహ్మణులను గుర్తించింది వైసీపీ ప్రభుత్వమేనని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో 92వ వార్డు నాయి బ్రాహ్మణుల కుటుంబాలతో ఎన్ఏడీ వైసీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు సంబంధించి జీవో వైసీపీ ప్రభుత్వంలోనే వచ్చిందని, దీని ప్రకారం అన్ని కమిటీల్లో డైరెక్టర్, సభ్యులుగా స్థానం ఉంటుందన్నారు. సంక్షేమంలో కూడా వీరికి ప్రత్యేక స్థానం కల్పించిందని వివరించారు. వైసీపీ ప్రభుత్వం మళ్ళీ రావాలంటే, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయి బ్రాహ్మణుల సంఘం ప్రతినిధులు కోరిన కమ్యూనిటీ హాల్ సమస్య పరిష్కారానికి భరోసా ఇచ్చారు. ఎన్నికల పరిశీలకులు ఎస్‌ఏ రెహమాన్, పేడాడ రమణి కుమారిలు మాట్లాడుతూ సేవ చేసే కుటుంబం నుంచి వచ్చిన ఆడారి ఆనంద్ కుమార్ ప్రజా సేవంటే ముందుంటారని అన్నారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఆడారిని గెలిపిస్తే, స్థానికంగా ఉన్న సమస్యలతో పాటు, విద్య, వైద్యానికి సంబంధించిన సమస్యలన్నీ తీరుస్తారని అన్నారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణుల సంఘం నేతలు ఆడారికి తమ మద్దతు ప్రకటించారు.

కండువా కప్పుకునేందుకు క్యూ కడుతున్న వర్గాలు

విశాలాంధ్ర – గాజువాక: ఎన్నికల సమయం ఆసన్నమవుతున్న తరుణంలో టీడీపీలోకి చేరికలు పెరుగుతున్నాయి. పసుపు కండువా కప్పుకునేందుకు ఔత్సాహికులు చొరవ ప్రదర్శిస్తున్నారు. గాజువాక వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ అధ్యక్షుడు చట్టి అప్పారావు (బాబు) నేతృత్వంలో 500 మంది టీడీపీలో చేరారు. వీరందరికీ కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీలో కీలక నేతగా వ్యవహరించిన చట్టి బాబు అక్కడ ప్రస్తుతం ఇమడలేక తన అనుచరగణంతో పార్టీలో చేరారు. స్థానిక స్థితిగతులపై పూర్తి అవగాహన, విద్యావంతుడు పల్లా సమక్షంలో చేరడం ఆనందంగా ఉందన్నారు. పారిశ్రామికాభివృద్ధి కూటమితోనే సాధ్యమని గుర్తించి తాము ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. పల్లా మాట్లాడుతూ గాజువాక కూటమికి కేంద్రం కావాలని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కూటమి విజయం సాధించాలని అందుకు అన్ని వర్గాల సహకారాన్ని కోరుతున్నట్లు తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనపై సంతృప్తి చెందని వాళ్లంతా టీడీపీలోకి వస్తున్నారని వీరందరికీ సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. 70వ వార్డు టీడీపీ, జనసేన నేతలు చట్టి గోపి, కొయిలాడ శంకరరావు, లంకలపల్లి మురళీదేవి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు ఆపకపోతే ఆత్మహత్యే శరణ్యం

బిల్డర్ సిల్ల ప్రసాద్‌రావు కుటుంబం ఆక్రందన

విశాలాంధ్ర – పెందుర్తి: ఆకాశపు సౌజన్య ఆమె భర్త భేరీ సోమలింగం అనే వ్యక్తులు డబ్బు కోసం తమను మానసికంగా వేధిస్తున్నారని పెందుర్తి మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న 69 ఏళ్ల సిల్లా ప్రసాదరావు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం తమ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రసాద్‌రావు అతని కుమారుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ 2021లో ఫ్లాట్ కొనుగోలు సందర్భంగా తమతో పరిచయమేర్పడిన సౌజన్య కుటుంబం పలు సందర్భాల్లో ఆర్థిక లావాదేవీలు నడిపారని తెలిపారు. ఈ క్రమంలోనే వారి నుండి దపదపాలుగా కొంత డబ్బు తీసుకున్న తాము తిరిగి ఎక్కువ మొత్తం చెల్లించేసామని చెప్పారు. ఇంకా మిగిలిన మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. చెల్లింపులకు సంబంధించి పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని వెల్లడించారు. అయితే వారి నుండి తాము తీసుకున్న దానికి మూడు రెట్లు అధికంగా డబ్బు ఇవ్వాలంటూ, సౌజన్య తమను వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ మేరకు ఆమె లాయర్ నోటీస్ పంపించగా, చెల్లింపులకు సంబంధించిన తన వద్ద ఉన్న ఆధారాలతో సమాధానం చెప్పినట్లు వెల్లడించారు. దీంతో ఆమె తనపైన, తన కుటుంబంపైన అక్కసు పెంచుకొని పలు విధాలుగా కేసులు పెట్టి తరచూ వేధిస్తున్నారని తెలియజేశారు. పోలీసులకు కూడా తమ వద్ద ఉన్న వివరాలు అందించామని, అయినా పలుమార్లు పోలీస్ స్టేషన్లకు పిలిపించి వేదనకు గురి చేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. గుట్టుగా వ్యాపారం చేసుకుంటున్న తమను వేధించి అక్రమంగా డబ్బు గుంజుకోవడానికి సౌజన్య ఆమె భర్త కుట్రలు చేస్తున్నారని తెలిపారు. వేధింపులు ఆపకపోతే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యమని, పోలీసులు, అధికారులు తమ ఆవేదనను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

4న తొలివిడత చందనం అరగదీత ప్రారంభం

విశాలాంధ్ర – సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వచ్చేనెల మే 4న తొలివిడత చందనం అరగదీత ప్రారంభం కానుంది. చందనం అరగదీత.. ప్రతి ఏటా చైత్ర బహుళ ఏకాదశినాడు గంధపు చెక్కల అరగదీత ప్రక్రియ శాస్త్రోక్తంగా మొదలవుతుంది. చందనం చెక్కలకు మూల విరాట్ సన్నిధిలో పూజలు చేసి ఆలయ వైదిక పెద్దలు తొలి చందనాన్ని అరగదీస్తారు. ఈ గంధాన్ని స్వామికి నివేదన చేస్తారు. అనంతరం ఆలయ ఉద్యోగులతో గంధం చెక్కల అరగదీత ప్రక్రియ మొదలవుతుంది. 32 ముప్పై రెండు సంఖ్యకు నరసింహస్వామికి అవినాభావ సంబంధం ఉంది.

నారసింహావతారాలు ముప్పై రెండు. నృసింహస్వామి మూల మంత్రంలోని అక్షరాలు ముప్పై రెండు. ఈ ప్రామాణికంలోనే తొలి విడత చందనం సమర్పణకు ముప్పై రెండు కేజీల చెక్కలను అరగదీసి సుమారు నూట ఇరవై ఐదు కేజీల గంధాన్ని అరగదీస్తారు. బేడా మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సానలపై ఉద్యోగులు గంధాన్ని అరగదీస్తారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ ప్రక్రియలో ఏ రోజుకారోజు అరగదీసిన గంధాన్ని తూకం వేసి అర్చకులు భాండాగారంలో భద్రపరుస్తారు.

ఫ్యాను గాలికి కూటమి కొట్టుకుపోవడం ఖాయం

వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: ఈ ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి కూటమిగా వచ్చినా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందిన మన వైసీపీ ఫ్యాన్ ముందు కొట్టుకుపోవడం ఖాయమని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 48వ వార్డు పరిధి బర్మా క్యాంపులో బొగ్గు శీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైసీపీ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని కె.కె.రాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె .రాజు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిపారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కట్టుమురి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్‌రావు, వార్డ్ ఇన్‌చార్జ్ నీలిరవి, జేసీఎస్ కన్వీనర్ వసంతల అప్పారావు, కరి రామారెడ్డి, రాజన్నగంగ రాజు, భూలోక్, చల్ల సత్యనారాయణ రెడ్డి, పద్మ, హేమంత్, అప్పారావు, 48వ వార్డ్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర – ఆనందపురం: మండలం బంటుపల్లి గ్రామ పంచాయతీ రెండో రోజు కార్యక్రమంలో భాగంగా గుప్తా ఆధ్వర్యంలో బాబు షూరిటి భవిష్యత్తు గారంటీ సూపర్ 6 పథకాల గురించి ఇంటింట ప్రచారం చేశారు. ప్రచార కార్యక్రమంలో కూటమి సూపర్ 6 పథకాల గురించి ఇంటింటికి తిరిగి ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గుప్తా, కూటమి నాయకులు డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, బంటుపల్లి శ్రీను, మీసాల శ్రీను ,సత్తిబాబు, బంటుపల్లి బుజ్జి, దుర్గా నరసింహనాయుడు, శంకరరావు, అచ్చిబాబు, ఉపేంద్ర తదితర నాయకులు పాల్గొన్నారు.

వైభోపేతంగా అవబృదోత్సవం

విశాలాంధ్ర – గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి స్వామివారి వార్షిక తిరు కళ్యాణం ఉత్సవాల్లో భాగంగా మంగవారం అవబృదోత్సవం వైభవంగా జరిగింది. ఈఓ తో పాటు ఉద్యోగులు, వైదికులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో చేడుక సర్పహించారు. ముందుగా వైదిక పెద్దలు ఆలయంలో విశేష హోమం, పూర్ణాహుతి, మంగళా శాసనం, కొట్బాల ఉతవర, చూర్ణోత్సవం, వసటోత్సవం పుర్తిచసుకున్నారు. పిదప శ్రీదేవి, భూదేవీ, చక్రణపేరుమాళ్‌తో పాటు పరివారాన్ని వెంటబెట్టుకుని ఉత్సవమూర్తి గోవిందరాజు స్వామివారు సంప్రదాయవాయిద్యాల నడుమ ప్రకృతి గంగధారకు చేరుకున్నారు. అక్కడ పంచ కలశస్నపన తిరుమంజనం, పంచామృతాభిషేకం అనంతరం ప్రధాన అర్చక బృందం గంగాధర వద్ద జలాల్లో అభిషేకం చేయించారు.

7 నియోజకవర్గాల్లో 18 నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: జిల్లాలోని 7 శాసనసభ నియోజక వర్గాల్లో 18 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన సంగతి విదితమే. కాగా ఆరవ రోజు 18 మంది అభ్యర్థులు 23 సెట్లను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేసారు. అందులో భాగంగా భీమిలి శాసనసభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా చొప్పల్లి శరవణ్ గణేష్, బావిశెట్టి రమణబాబు తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా శివరామకృష్ణ అనగాని, డాక్టర్ మాతే సురేష్‌లు తమ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కె.మయూర్ అశోక్‌కు సమర్పించారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా జె.బిపిన్ కుమార్ జైన్ ఒక సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి సంతోష్ కుమార్ రెండు సెట్ల నామినేషన్లు రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పెనుమత్స విష్ణుకుమార్ రాజు రెండు సెట్లు వేయగా, పెనుమత్స శ్యామలా దీపిక అదే పార్టీ నుంచి రెండు సెట్లను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి వి.వి.యస్.కమలాకర రావు ఒక సెట్, రామారావు లక్కరాజు రెండు సెట్ల నామినేషన్లు, బహుజన సమాజ్ పార్టీ నుంచి పెద్దాడ కనక మహాలక్ష్మీ ఒక సెట్ నామినేషను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి రవికుమార్ వెలగాడ సమాజ్ వాదీ పార్టీ నుంచి నామినేషన్ వేయగా, బహుజన సమాజ్ పార్టీ నుంచి అతుకుంశెట్టి రామచంద్రరావు, స్వతంత్ర అభ్యర్థిగా మండపాటి శ్రీనివాసరాజు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. గాజువాక నియోజకవర్గం నుంచి సిపిఐ (ఎం) పార్టీ నుంచి మైలవరపు రాంబాబు నామినేషన్ వేయగా, స్వతంత్ర అభ్యర్థిగా సీమకుర్తి శ్రీనివాసరావు అలియాస్ భగవాన్ శ్రీను తమ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారికి అందజేసారు. పెందుర్తి శాసనసభ నియోజకవర్గం నుంచి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి పిరిడి భగత్ రెండు సెట్లు వేయగా, స్వతంత్ర అభ్యర్థిగా పొన్నాడ అప్పలనాయుడు ఒక సెట్ నామినేషన్ వేశారు.

విశాఖ ఎంపీగా గెలిస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకుంటా

– కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సత్యా రెడ్డి

విశాలాంధ్ర – విశాఖ సిటీ: తాను విశాఖపట్నం కాంగ్రెస్ పార్టీ ఎంపీగా విజయం సాధిస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకుంటానని కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి పులుసు సత్యారెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టరు మల్లికార్జున వద్ద నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ జిల్లా కాంగ్రెస్, సేవా దళ్, యూత్ కాంగ్రెస్ శ్రేణులతో పలు ప్రాంతాల మీదుగా ఊరేగింపు జరిగింది అన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాలతో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో బీ ఫారం అందుకున్నానని, విశాఖలో కాంగ్రెస్ బలం బాగా పుంజుకుందన్నారు. పోలవరం, రైల్వే జోన్, ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తామన్నారు. ఏపీలో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు నారాయణ రెడ్డి, 28వ వార్డు అధ్యక్షుడు గుర్రం కనకారావు, 48వ వార్డు అధ్యక్షుడు అరుగుల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

COURT NOTICE
IN THE HONOROBLE COURT OF THE VII SPECIAL MAGISTRATE COURT AT VISAKHAPATNAM
C.C. No. 6887/2022
Between:
Shriram Transport Finance Co.Ltd. Visakhapatnam, rep. by its GPA Holder ... Complainant
VERSUS
Bogi Chandra Sekhar ...Accused
Accused:
Bogi Chandra Sekhar, S/o. B.Adi narayana, D. No. 5-2-4, Pedajalari Peta, Visakhapatnam – 530001.
Present Address:
D.No.25-6-11, Sector–III, Behind Pollocks School, M.V.P. Colony, Double Road, Visakhapatnam – 530017.
NOTICE
The accused may take Notice that the above complainant filed a complaint under Negotiable Instruments Act against you. The said case stands posted on 07.05.2024 at 10.30 A.M. for your appearance. Therefore take Notice and appear before the court in person or through your Advocate in the above named court at 10.30 A.M on 07.05.2024, failing which you will be set exparte and petition will be allowed against you. Hence this Notice.
Visakhapatnam. Dt
A.Omkumar, Advocate, Visakhapatnam

ఓటింగ్ శాతం పెంచేందుకు సహకరించాలి

ఎన్.జి.వో.లకు పిలుపునిచ్చిన జేసీ కె.మయూర్ అశోక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ లక్ష్యాలను చేరుకోవటంలో అధికార యంత్రాంగానికి, ఓటర్లకు సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్, తూర్పు నియోజకవర్గ ఆర్.వో కె.మయూర్ వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కోరారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారందరితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రాంతంలో ఓటు హక్కు వినియోగం చుకోవటంలో ఓటర్లు ఉత్సాహం కనబరచటం లేదని వారిని ప్రోత్సహించి వారంతా తప్పకుండా ఓటు వేసేలా ఎన్.జి.వో.లు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. పోలింగ్ రోజున ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల అవసరాల రీత్యా యంత్రాంగం తరఫున వసతులు కల్పిస్తున్నామని, ఎన్.జి.వో.లు కూడా తమ వంతు సహాయం అందించాలన్నారు. అనంతరం ఎన్.జి.వో.లు అడిగిన ప్రశ్నలకు జేసీ సమాధానాలు ఇస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - కొమ్మాది: పదో తరగతి ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల విజయభేరి మోగించారు. శ్రీ చైతన్య ఉత్తరాంధ్ర టాప్ 600కి 598 మార్కులతో ముగ్గురు, స్టేట్ సెకండ్ టాప్ మార్క్ 597 మార్కు ఆపైన 9 మంది శ్రీ చైతన్య విద్యార్థులు ఉన్నారు. స్టేట్ టాప్ మార్క్ 598 మార్కులతో ముగ్గురు, 597 మార్కులు ఆపైన 9 మంది, 596 మార్కులు ఆపైన 24 మంది, 595 మార్కులు ఆపైన 55 మంది, 594 మార్కులు ఆపైన 123 మంది, 590 మార్కులు ఆపైన 524 మంది, 580 మార్కులు ఆపైన 2321 మంది విద్యార్థులు సాధించారు. సబ్జెక్టుల వారీగా 100కి 100 మార్కులు సాధించిన శ్రీ చైతన్య విద్యార్థులు 7394 మంది ఉన్నారు. శ్రీ చైతన్య ఉత్తరాంధ్ర టాప్ మార్క్ 600 కి 597 మార్కులు శ్రీకర్ కైవసం చేసుకున్నారు. మధురవాడ బక్కన్నపాలెం రోడ్ లో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివిన విద్యార్థులలో ముగ్గురు 590 మార్కులపైన సాధించారు. 593 మార్కులు ఎమ్.మను శ్రీ, 592 మార్కులు జి.నిస్సీ మార్క్, 591 మార్కులు బి.ఉజ్వల్ అత్యుత్తమ మార్కులను సాధించారు. మొత్తం 174 మంది విద్యార్థులలో 500 మార్కులకు పైబడి 116 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నారని పాఠశాల ప్రిన్సిపల్ సందీప్ తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్స్ ఉత్తరాంధ్ర ఏ.జీ.ఎం. ఎ.వి సురేష్, రీజినల్ ఇన్చార్జ్ అహ్మద్ అలీ, అకడమిక్ కో-ఆర్డినేటర్ రాజేష్ పాఠశాల డీన్ ధిల్లె శ్వరరావు, సీ-బ్యాచ్ ఇన్చార్జ్ సాయిరాం, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

మాలతాంబ విద్యానికేతన్ ప్రభంజనం...

విశాలాంధ్ర - పీఎం పాలెం: 10వతరగతి 2024 ఫలితాలలో కార్ షెడ్ జంక్షన్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం చేరువలో గల మాలతాంబ విద్యానికేతన్ విద్యార్థులు పది ఫలితాలలో విజయభేరీ మోగించారు. అత్యుత్తమ ఉత్తీర్ణత 586 మార్కులతో ఫలితం సాధించినట్లు పాఠశాల ఏ.ఓ. ఆదిమూర్తి తెలియజేశారు. పి.చరణ్యసత్య 586, ఎన్.హాసిని 581, ఆర్.కీర్తన 576, బి.అమర్ శ్రీరామ్ 568 మార్కులతో జయహో... మాలతాంబ అనిపించారు. ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులను మాలతాంబ విద్యా నికేతన్ కరస్పాండెంట్ సునీల్ మహంతి అభినందనలు తెలియజేశారు. మొత్తం విద్యార్థులలో 500మార్కులు పైబడినవారు 50శాతం, 400 మార్కులు పైబడినవారు 40శాతం, అన్ని సబ్జెక్ట్ లలో గరిష్ట మార్కులు 100కు 100 సాధించిన వారిని అనందకరమని, 586 మార్కులు సాధించిన పి.చరణ్యసత్యకు 10,000/-, 581 మార్కులు సాధించిన ఎన్.హాసినికు 5000/- రూ., 576 ఆర్.కీర్తనలకు పాఠశాల అధినేత సునీల్ మహంతి పురస్కార బహుమతి అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయం తమకెంతో ఆనందాన్ని కలిగించిందని, మాలతాంబ విద్యానికేతన్ విద్యార్థిని విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించడానికి మరింత ఉత్సాహంతో ప్రణాళికా రూపొందిస్తామని పాఠశాల అధినేత సునీల్ మహంతి అన్నారు.

అభివృద్ధిని చూసి వైసీపీ పార్టీలోకి వస్తున్నారు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: స్థానిక జీవీఎంసీ 10వ వార్డ్ ఎస్సి సెల్ అధ్యక్షులు ప్రసాద్ సమక్షంలో మంగళవారం విశాఖ పార్లమెంట్ సభ్యులు, తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో 10వ వార్డు ఇందిరాగాంధీ నగర్ ప్రాంతానికి చెందిన టీడీపీ నుండి వైసీపీ పార్టీలోకి 50 మంది చేరారు. ఈ సందర్భంగా ఎంవీవీ సత్యనారాయణ వారికి వైసీపీ పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమం అభివృద్ధిని చూసి వైసీపీ పార్టీలోకి రావడం హర్షణీయమని అన్నారు. స్ఫూర్తిగా తీసుకుని సీనియర్ నాయకులు ఇలా వైసీపీ పార్టీలోకి ముందుకు రావడం చాలా సంతోషం అని అన్నారు. కుల మతాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అర్హులకు సంక్షేమ పథకాలు అందించారని, ఇప్పటికే నియోజకవర్గంలో కోట్ల రూపాయల వ్యయంతో ఆలయాలు అభివృద్ధి,సామాజిక భవనాల అభివృద్ధి చేపట్టామన్నారు. తూర్పు నియోజకవర్గంలో గడిచిన పర్యాయాలు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నియోజకవర్గం అభివృద్ధి చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పటికైనా ప్రజలు అభివృద్ధిని గమనించి రానున్న ఎన్నికలలో ఏపీ సీఎం గా వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారికి మద్దతు ఇవ్వాలని, తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో పతివాడ కనకరాజు, పతివాడ వెంకటలక్ష్మి, ఎస్ కాంతం, ఎస్.కె సైదాబీ, అప్పల నరసమ్మ పార్టీ శ్రేణులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ శిరిడి సాయి ధ్యాన మందిర వార్షికోత్సవం

విశాలాంధ్ర - కొమ్మాది: జీవీఎంసీ 5వ వార్డు పరిధి కొమ్మాది జంక్షన్ డ్రైవర్స్ కాలనీ (కార్పెంటర్స్ కాలనీ దరి)లో వేంచేసి ఉన్న శ్రీ షిరిడి సాయి ధ్యాన మందిరం 6వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన భీమిలి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అతిథుల చేతుల మీదుగా భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో యువత అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. సుమారు 3500 మందికి అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు అధ్యక్షులు పి.వి.రమణమూర్తి తెలిపారు. ప్రతిఏడది లాగే ఈ సంవత్సరం అన్నప్రసాదాన్ని అందించటం జరిగిందని, ఇంతటి మహత్తర కార్యక్రమానికి హాజరైన గంటా శ్రీనివాసరావు వారి కుటుంబ సభ్యులకు ఆ షిరిడిసాయి నాధుని ఆశీస్సులు నిత్యం ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఇన్చార్జ్ కోరాడ రాజబాబు, చిక్కాల విజయబాబు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, పార్లమెంటరీ ఉపాధ్యక్షులు వాండ్రాసి అప్పలరాజు, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, నాగోతి వెంకట సత్యనారాయణ, ఈగల రవికుమార్, బొడ్డేపల్లి రంగారావు, నారాయణరావు, ఆలయ ధర్మకర్త కమిటీ సభ్యులు రమణమూర్తి, ఈశ్వరమ్మ, బోని రాజు, హేమలత, వియ్యపు నాయుడు, కొండవరాజు, బిర్లంగి నారాయణరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం సొంట్యాం సబ్ స్టేషన్ 11కెవి మామిడిలోవ, 11కెవి సొంట్యాం ఇండస్ట్రియల్ లైన్ మెయింటెనెన్స్ కొరకు బుధవారం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా రామవరం, సొంట్యం, జి.ఎస్.అగ్రహారం, గండిగుండం, మామిడిలోవ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు.

ఉత్తర బిజెపి అభ్యర్థిగా విష్ణుకుమార్ రాజు నామినేషన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఉత్తర నియోజకవర్గం బిజెపి , టిడిపి, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పి విష్ణుకుమార్ రాజు నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఉత్తర నియోజకవర్గం కార్యాలయం నుండి పాదయాత్రగా నడుచుకుంటూ ఎమ్మార్వో ఆఫీస్ కి వెళ్లి నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, పార్లమెంట్ అభ్యర్థి శ్రీ భరత్ , నార్త్ ఇన్చార్జి జనసేన ఉషాకిరణ్ , సంకు వెంకటేశ్వరరావు , బొడ్డేపల్లి రఘు , అలాగే టిడిపి ముఖ్య నాయకులు జనసేన నాయకులు, కార్యకర్తలు బిజెపి నాయకులు, పెద్ద సంఖ్యలో హాజరయ్యి విజయవంతం చేశారు.

భక్తులకు ప్రసాద వితరణ చేసిన ఎంవీవీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ పెదవాల్తేరులో 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం శ్రీకరక చెట్టు పోలమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం పురస్కరించుకొని విశాఖపట్నం పెద జాలరి పేట, పెద్ద వాల్తేరు ప్రాంతాలలో భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాఖ పార్లమెంట్ సభ్యులు తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సుమారుగా 2000 మందికి పైగా ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జివి రామచంద్రరావు అధిక సంఖ్యలో భక్తులు మహిళలు పాల్గొన్నారు.

నేడు ఎంవివి నామినేషన్

తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆరిలోవ నుంచి ఉదయం ర్యాలీగా బయలుదేరి వెంకోజీపాలెం, ఇసుకతోట, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు మీదుగా కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర - భీమిలి: మత్స్యకారులకు అణువణువునా అండగా ఉంటూ వారి అభివృద్ధికి, సంక్షేమానికి వందకువంద శాతం నిధులు ఖర్చుపెట్టి మెరుగైన అభివృద్ధికి బాటలు వేసేది తెలుగుదేశం పార్టీయేనని రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి జోన్ 3వ వార్డు మత్స్యకారుల గ్రామం బోయవీధిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, బిజెపి, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా మత్స్యకారులు, మహిళలు, యువత అందరూ కలిసి నడిచి వారికి సంఘీభావం తెలియజేసారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటువేసి గెలిపించుకుంటామని ముక్తకంఠంతో హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు వారిని ఉద్దేశించి మాట్లాడుతూ మత్స్యకారులకు అండగా ఉండేది తెలుగుదేశం పార్టీయేనని అన్నారు. 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చిన ఘనత చంద్రబాబుది అని అన్నారు. తెలుగుదేశం హయాంలో మత్స్యకారులకు వలలు, తెప్పలు, బోట్లు, ఇంజన్లు మరియు ఇతర పనిముట్లు 50 శాతం సబ్సిడీతో ఇచ్చి వారికి అండగా ఉన్నారని అన్నారు. టిడిపి హయాంలోనే మత్స్య పరిశ్రమ అభివృద్ధి చెంది దేశాయ, విదేశీ మార్కెట్లో ఘనవిజయమైన డిమాండ్తో ఫిషింగ్ ఎక్కువ మంచి గిట్టుబాటు ధరలు లభించాయని అన్నారు. ఈ ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే తప్పకుండా ఫిషింగ్ జెట్టి, పోర్ట్ నిర్మాణం చేపడతామని అన్నారు. తీరం వెంబడి లైట్ హౌస్ నుండి పోలమాంబ ఆలయం వరకు రక్షణ గోడ నిర్మాణం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సంకురుభక్త సునీత, తెలుగు దేశం పార్టీ నాయకులు గొలగాని నరేంద్రకుమార్, మారోజు సంజీవకుమార్, పెంటపల్లి యోగీశ్వరరావు, శంకర్, కాసరపు ఎల్లాజీ, వాడమొదలు సత్యారావు, కొక్కిరి అప్పన్న, కొక్కిరి నూకరాజు, కాసరపు ఎల్లాజీ, జలగడుగుల మురళి, పుక్కళ్ళ లక్ష్మీకుమారి, అరసవిల్లి అనిల్, వాడమొదలు లక్ష్మయ్య, కొక్కిరి నాగరాజు, కొక్కిరి రమణ, పైడపల్లి నర్సింగరావు, పిళ్ళా తాతారావు, మట్టా దాసు, దౌలపల్లి హరీష్, వియ్యపు పోతురాజు, కుప్పిలి గురుమూర్తి, కొక్కిరి వీర్రాజు, కొక్కిరి అప్పన్న, కొక్కిరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

తోట త్రిమూర్తులు అప్పీల్‌పై కౌంటర్ వేయని రాష్ట్ర ప్రభుత్వం

సొంత ఖర్చులతో కోర్టును ఆశ్రయించిన బాధితులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వెంకటాయి పాలెం శిరోముండనం కేసులో ముద్దాయిలకు విశాఖ కోర్టు విధించిన 18 నెలలు జైలుశిక్షను రద్దు చేయాలని తోట త్రిమూర్తులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో బాధితుల తరఫున నాయ వాది శరత్ సెక్షన్ 15ను అనుసరించి అభ్యంతరం చెప్పడంతో కేసును మే 1కి వాయిదా వేశారని విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు పత్రికా ప్రకటనలో తెలిపారు. బాధితుల తరఫున రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్ కానీ కనీసం పేనల్ పీపీ అయినా హై కోర్టులో అభ్యంతరం చెప్పడం లేదా కౌంటర్ వేయలేదన్నారు. నిందితుడు తోట త్రిమూర్తులు అధికార పార్టీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి అయినందున రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించిందన్నారు. ఇది స్టేట్ ఇంట్రెస్ట్ కి వ్యతిరేకం ఎస్సి ఎస్టీ అట్రాసిటీ చట్టానికి వ్యతిరేకం అన్నారు. ప్రభుత్వం దీనిపై కోర్టుకి, ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు.

చంద్రబాబును కలిసిన జోగ ముత్యాలు

విశాలాంధ్ర - ఆనందపురం: విశాఖ జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి జోగ ముత్యాలు మంగళవారం టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వివిధ అంశాలపై ఆయనతో చర్చించి భీమిలి నియోజకవర్గం పరిధిలో కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి తెచ్చేందుకు మరింత బలంగా పనిచేస్తానని ఏదైనా సరే అధికారం తెలుగుదేశం పార్టీదే అని ఈ సందర్భంగా చంద్రబాబుతో అన్నారు. సానుకూలంగా స్పందించిన అధినేత అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కారం చేస్తామని భరోసా కల్పించారు.

చురుగ్గా గుంటూరు ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుంటూరు వెంకట నరసింహారావు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం విస్తృతంగా సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం గొరపల్లి, కోట్ని వాని పాలెం, గవరపాలెం, గొల్లలపాలెం గ్రామాల్లో కుటుంబ సభ్యులు అభిమానులు మద్దతుదారులతో కలిసి ఇంటింటి ప్రచారం సాధించారు. స్థానిక నాయకులను కలిసి మన పెందుర్తి మన అభివృద్ధి నినాదాన్ని వివరించారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆలోచించి ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయా గ్రామాలకు సర్పంచ్ లతో మాట్లాడి మద్దతు ఇవ్వాలని కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మణరావును పరామర్శించి ధైర్యం చెప్పారు. గొర విల్లి అప్పన్న తదితరులు నరసింహారావుకు సంఘీభావం తెలిపారు.

ప్రచారంలో అస్వస్థతకు గురైన పంచకర్ల

విశాలాంధ్ర -పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎన్డీఏ కూటమి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పంచకర్ల రమేష్ బాబు మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని అక్కిరెడ్డిపాలెంలో ప్రచారం చేస్తున్న సమయంలో ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యారు. గత రెండు రోజులుగా ఆరోగ్యం బాగా లేనప్పటికీ ఎన్నికలు సమీపించడంతో ప్రజలతో మమేకమయ్యేందుకు ఆయన రణరంగంలో పరుగులు తీస్తున్నారు. అనుచరులు విశ్రాంతి తీసుకోవాలని సూచించినప్పటికీ వినకుండా ప్రచారం సాగిస్తున్నారు. పెందుర్తి అభ్యర్థిగా తన పేరును ప్రకటించినప్పటి నుండి రాత్రి పగలు తేడా లేకుండా పగలంతా ప్రచారం, రాత్రులు నాయకులు కార్యకర్తలతో సమీక్షలు చేస్తూ సాగుతున్నారు. వేళకు తిండి, సరైన నిద్ర లేకుండా ప్రచారం సాగిస్తుండటంతో పంచకర్ల రమేష్ బాబు తీవ్ర అలసటకు గురైనట్లు జనసేన శ్రేణులు తెలిపాయి. మరోవైపు గత నాలుగు రోజులుగా ఎండలు మండిపోవడంతో మంగళవారం ఒక్కసారిగా అతని ఆరోగ్యం క్షీణించింది. దీంతో జనసేన నాయకులు కార్యకర్తలు అతన్ని విశ్రాంతి కోసం నగరానికి తరలించారు.

బిజెపి ముమ్మర ప్రచారం

విశాలాంధ్ర - పెందుర్తి: ఎన్డీఏ కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేష్ నాయుడు, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబును గెలిపించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ శ్రేణులు ముమ్మర ప్రచారం సాగిస్తున్నాయి. జీవీఎంసీ 97 వార్డు చిన్న మునిపాక, వుడా పార్కు ప్రాంతాలలో బిజెపి సీనియర్ నాయకులు, మాజీ కన్వీనర్ కోన మంగయ్య నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బిజెపి జిల్లా కార్యదర్శి పురిజాల బాలసుబ్రమణ్యం పార్టీ నాయకులు విటల్, భరద్వాజ్, శ్రావణ్ కుమార్, ప్రచారక్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 93 వార్డ్ వెంకటాద్రి నగర్, గొల్లపాలెం ప్రాంతాలలో విస్తారక్ అప్పారావు, మహిళా మోర్చా నాయకులు భువనేశ్వరి, పద్మ తదితరులు ప్రచార నిర్వహించి ఎన్ డి ఏ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. రూరల్ మండల పార్టీ అధ్యక్షులు కాళ్ళ జగన్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు పెదగాడి, గుర్రంపాలెం, పెదగాడ గ్రామాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో 39వ వార్డు యువత

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: 39వ వార్డుకు చెందిన మహిళలు, యువత రాజా గౌడ్, పిల్లి వరదేశ ఆధ్వర్యంలో "వంశీకృష్ణ" సమక్షంలో కృష్ణ గార్డెన్స్ లో గల పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీలో చేరారు. పరమేశ్వరి, వరదేశమ్మ, దేవి, రాజేశ్వరి, భవానీ, అరుణ, పార్వతి, రామలక్ష్మి, హేమ, ధన, విదమ్మ, నూకరత్నం, పింకి, రాజు, ఈసు, త్రినాథ్, చల్లమ్మ తదితర మహిళలు సుమారు 50 మంది జనసేన కండువా కప్పుకున్నారు. వారందరినీ వంశీకృష్ణ సాదరంగా పార్టీలోకి స్వాగతించి జనసేన పార్టీ కండువా కప్పారు. కార్యక్రమంలో 39వ వార్డు జనసేన వార్డు ప్రెసిడెంట్ తాతారావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు లబ్ధి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దక్షిణ నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ సతీమణి పద్మజ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా మహిళలకు కుంకుమ బొట్టు పెట్టి వంశీకృష్ణకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గాజు గ్లాస్ గుర్తుపై ఎమ్మెల్యేకి, సైకిల్ గుర్తుపై ఎంపీ అభ్యర్థి శ్రీ భరత్ కి ఓటు వేయాలని కోరారు. మంగళవారం 27వ వార్డు పరిధిలో గల శ్రీనగర్ పరిసర ప్రాంతాల్లో పద్మజ మహిళలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన భర్తను గెలిపించాలని కోరుతూ ఇంటి ఇంటికి ప్రచారం చేశారు. గడపగడపకు తిరుగుతూ మహిళలకు కుంకుమ బొట్టు పెట్టి, ఎన్డీఏ ప్రభుత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి ,బిజెపి నాయకులు పాల్గొన్నారు.